# "జీవాత్మ ..... పరమాత్మ ..... "!

రైలు ప్రయాణాలు తగ్గించండి—అది అవసరమని అనుకుంటేనే ప్రయాణం చెయ్యండి. అంత అవసరమా అది ? ఈ మాటలు నన్నెవరో అడుగుతున్నట్లనిపించింది.

బాగా ఆలోచించుకున్నాను. నేచేసే ప్రయాణం అవసరమైనదే. వాళ్ళు చెప్పినట్లు (తేలిగ్గా ప్రయాణం చెయ్యమని) సామానుకూడా ఎక్కువలేదు. ఒక్క హోల్డాల్ తప్ప అదికూడా మరీ తేలిగ్గావుంది.

రైలుపెట్టె తలుపు తీసుకుని లోపలికి పొయ్యేటప్పటికి ఎవరో ఒకాయన ఉండి ఏమయ్యోయ్ మా నెత్తిన కూచుంటావా పద పద ఇంకో పెట్లోకి అనేటప్పటికి బాబుజీ అన్ని పెట్టెలూ అలాగే వున్నాయండి వున్నకాస్త నిల్చోనిస్తే అదే పదివేలు అన్నాను. రైలుపెట్టెలోకి చొచ్చుకుపోవడమే ప్రధానం తప్ప లోపలికివచ్చి ఎక్కడ కూచుందాం అన్న ఆలోచనలేదు ఎక్కేజనానికి. ఫరవాలేదు ఫుట్ బోర్డు మీదనైనా నుంచుంటాం అనేవాళ్ళు వీళ్ళుచేసే ఈ ప్రయాణాలు అవసరమా అనవసరమా అనిపించింది నాకు. బాబూ, కొంచెం సర్దుకుంటే ఒక్కడికి కూచోటానికి స్థలం వుంటుందనేటప్పటికి ఆయన గుజరాతిలో తల్లక్రిందులుచేసేటట్లు మాట్లాడారు. ఈ విషయాల్లో లేనికోపాలు తెప్పించుకుంటారు వ్యక్తులు.

ఏమీ తోచక కొంచెం సేపు నిల్చుండేటప్పటికి నా దృష్టి పై బెర్తుమీద పడుకున్న మిలిటరీవానిమీదికి పోయింది. అత్త వారింట్లో అల్లుడు పడుకున్నట్లు పడుకున్నాడు. ఏం నాయనా కొంచెం లేవకూడదూ మేంకూడా కూచుంటాంగా అనేటప్పటికి కొట్టవచ్చినట్లు మాట్లాడు ఇహ ఏమిటి చెయ్యడం నేను ఢిల్లీ నుండి వస్తున్నాను నిద్రలేదు. అసలు అయినా మమ్మల్ని లేపటాన్కి నీకు హక్కులేదన్నాడు రైలు తనదే అయినట్లు. దాందుంపతెగ ఒక్కడు ఒక్కడన్నా ఇక్కడ కూచోస్వామీ అన్న పాపాన పోలేదుకదా రైల్లో ఎక్కేటప్పటికి ప్రతి వాడికీ నాయకత్వం వస్తుంది. చివరకు ఏదో విధంగా ఒకమూల సర్దుకు కూచున్నాను. నాతో ఎక్కిన మిగతా నలుగురూ నిల్చునివున్నారు.

రైలు కదిలింది ఎంతోహాయి అనిపించింది. ఆ నలుగుర్లో కొంచెం వయసుమళ్ళిన ముసలాయన ఒకడున్నాడు. కేవలం బలహీనుడిగా కనిపిస్తూ నిల్చోటానికికూడా శక్తి లేకుండా ఆ ముగ్గుర్నీ ఊతంచేసుకుని నిల్చున్నాడు. రైల్లో అనేకులు అనేక విధాలుగా ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. అయన్నెవరూ కూచోనివ్వలేదు. నన్ను కాస్త కూచోనిద్దురూ పుణ్యం వుంటుంది. నా నాయినా అన్నాడు గద్గగ కంఠంతో. ఆంధ్ర రాష్ట్రమో అని గోలపెడ్తె ఒకప్పటికి కాకపోతే ఒకప్పుడైనా కొద్ది సంవత్సరాలకైనా ఏమిటి అసలు సంగతి ? అని తెలుసు కుందామని కొంచెం చెవులు ఇటువైపు పెట్టింది ప్రభుత్వం. ముసలాయన మొరను ఎవ్వరూ వినిపించుకుండేవాళ్ళు లేరు.

చాల ప్రశాంతంగా ఒడుదుడుకులు లేకుండా

పోతున్నది రైలు. పెట్టెలో కొంతమంది నిద్రలో మునిగి తేల్తున్నారు. అంతా నిశ్శబ్దంగావుంది. నా పక్కన కూచున్న వ్యక్తి నామీద కోపంగావున్నట్టు గ్రహించాను. కారణం ఏమిటీ అంటే అతనుకూర్చున్న స్థలం నేనుకొంత ఆక్రమించాను. అతనివైపు చూడనన్నా లేదు...ఎదురుగ్గావున్న మరాఠీమనిషి ఉమర్ ఖయ్యామ్ పుస్తకం చదువుతూ నిన్న గతించిపోయింది. రేపు రాబోతున్నది. రెంటినిగురించి ఆలోచించ వద్దన్నాడు. దాంట్లో పద్యాలు చాల మాధుర్యంగా వున్నయి అన్నాడు.

ఇంతలో స్టేషనువచ్చింది. మరీ చిన్నస్టేషనవడంచేత రైలు ఆగింది కదిలింది. రైలు కదిలేటప్పటికి నిద్రపోతున్న వాళ్ళల్లో ఒకరిద్దరు మేల్కొన్నారుకూడా.

నాకు కొంచెం కునుకుపట్టింది.

ఎవుర్రోయ్ ముసలాయనపడ్డాడు అన్నారెవరో. నాకు చాలా గాభరావేసింది. రైలులోంచి కిందపడలేదుకదా అనుకున్నాను. తలుపుకూడా తెరిచివుంది. గొలుసు లాగుదామా అని లేచి నిల్చున్నాను. కిందపడ్డ ముసలాయన్ని పక్కనున్న ఇద్దరూ లేవతీశారు. ఎవరూ పలకరించినా ఏమీ మాట్లాట్టంలేదు మూర్ఛ పాపం నీళ్ళుకొట్టండి అన్నారు కొంతమంది. పెట్టెలో నిద్రపోతున్నవారందరూ లేచారు.

ముసలివాడాయను మతిపోయి ఊగుతున్నాడన్నారు నాకు నిజానికి జాలివేసింది. ఆయన పడబోతుంటే మనుషులెవరో పట్టుకున్నారు గాని కాస్త ఇవతలపడితే ప్రాణాలే పోయి

వుండును. ఇందరూ ఇన్ని మాటలు అన్నారుగాని ఆయన ఏమీ మాట్లాడలేదు. పోనీ ఇతర్లు అంటున్న మాటలు ఆయనకు వినపడుతున్నవా అని సందేహం కలిగింది. ఇద్దరు ఘనాపాటీలు పట్టుకుని వున్నారు. ఇంకోమనిషి తూల్తూనే ఉన్నాడు. కాసిని నీళ్ళు ముఖానచల్లుదామంటే నీళ్ళన్నాలేవు పెట్టెలో ఎక్కడా ఏం చెయ్యాలో ఎవ్వరికీ తోచలేదు. పోనీ పక్కస్టేషన్లో దింపేద్దామా తనది ఏ వూరో ఎక్కడినుండి వస్తున్నాడో ఎక్కడికి వెళ్తున్నాడో ఏమీ చెప్పడు.

మరో కొంతమంది నిశ్చయానికివచ్చారు. వచ్చేస్టేషన్లో స్టేషనుమాష్టరుతో చెప్పి దింపివేద్దామని లేకపోతే ఇక్కడే చచ్చిపోతాడు. కళ్ళు తేలవేస్తున్నాడు. నిమిషనిమిషానికి భయంవేస్తున్నది. మనుషులమీదికి తూల్తున్నాడు. అనుకుంటుండగా స్టేషనువచ్చింది. అర్ధరాత్రప్పుడు ఇక్కడ దింపి వేస్తే ఏమైపోతాడు. ముసలాడు పాపం అనుకున్నారు. పార్లమెంటులో చర్చలాగా అయిపోయింది చివరకు...

రైలు కదిలింది. ప్రతివాడికీ ముసిలాయనున్న గురించిన ఆదుర్ద ఎక్కువైంది. ఒకవేళ రైలులోనే ప్రాణం పోతుందేమో అని భయపడటం మొదలుపెట్టారు కొంతమంది.

మా బెంచీమీద కూచున్నవాళ్ళం నలుగురం లేచాం చాలా ఖాళీవచ్చింది. బాగా గాలివచ్చేటట్టు ఆ కిటికీలు తెరచి వుంచాం. ఆమాత్రం ఒకరికి ఒకరం సాహాయ్యం చేసుకోకపోతే ఎట్లా ముసిలివాడిప్రాణం కాపాడితే పుణ్యంవుంటుంది. ఐకమత్యం ఉండక్కర్లే మనలో మనకు మా స్వరాజ్యం సంగతి కొంచెం ఆలోచించరా బాబూ అంటే ఆ ఆమెరిని అదుగో ఐకమత్యంలేదు అని వేలుపెట్టి చూపిస్తున్నాడు. సమయం

చూసి ఉపన్యాసధోరణిలో మాట్లాడుతున్నాడు ఒక మహానుభావ్....ఎక్కడలేని వేదాంతాలూ వచ్చినయి ప్రతివాడు చోటు ఇస్తానన్నవాడే.

ఇప్పటికీ మునిలాయన మాట్లాట్టంలేదు. బ్రతుకుతాడా అన్న సంశయం కలిగింది మాకు.

కొంచెందూరం పోయేటప్పటికి కళ్ళు తెరిచాడు. "ఏమిటి నాయనా" అని వణుకుతున్న కంఠంతో ఆ మాత్రం అనగలిగాడు.

ఆ మాట వినేటప్పటికి మాకు చాల సంతోషమేసింది. ఏమీలేదు మీకున్నట్టుండి పడిపోయినారు మేం లేవతీసి కూచోపెట్టాం. ఎన్నిపిలిచినా పలకలేదు అని చెప్పేడొకాయన జరిగిన సంగతంతా.

ప్రతివాడూ ఆయనమీద ప్రశ్నలవర్షం కురిపించటమే.

"తాతగారూ ఎంతదాకా పోవాలి మీరు ?"

"కాస్త మంచితీర్థం ఇప్పిద్దురూ పుణ్యం వుంటుంది అన్నాడాయన.

అంతకుముందు స్టేషన్‌లో పట్టననీళ్ళు కొంచెం లేవబోకండి తాతగారూ కొంచెం పరుండండి అన్నారు.

రైలు చాలా వేగంగా పోతున్నదే నాయనా అన్నాడు ముసలాయన.

మీరు క్రిందపడ్డప్పుడు మీప్రాణం పోతుందో అని భయపడ్డాం అందరంకూడా అన్నాడొకాయన.

"అందరూ కలిసి చందా అన్నా వేసుకొని అంత్యక్రియలు జరిపితే అ పుణ్యం మీకేవుండేదిగా జవాబుచెప్పాడు చమత్కారంగా.

ఆత్మ దాని లక్షణాలు మానవునిలో అంతర్దశలు గీతా సారం వీటిని గురించి చిన్న ఉపన్యాసం చెప్తున్నాడు.

ఈయన చాలా భక్తిపరాయణుడు అని అందరూ ఆయన చెప్పిందే వింటున్నారు. ఆయన ఏదో చెప్తున్నాడు. స్టేషన్‌లు ఒకదానివెంట ఒకటి వస్తున్నాయి.

జీవాత్మ పరమాత్మ వీటినిగురించి మాట్లాడుతున్నాడు.

ఈయన ఎంతగొప్ప వేదాంతి అని ఒకరు బాగా చదువుకున్నవాడని ఒకరు చాలా భక్తిపరాయడని ఒకరూ ఎవ్వరిష్టం వచ్చినట్లు వారు చెప్తున్నారు.

ఒక స్టేషను వచ్చింది.

ఆ తరువాత వచ్చేస్టెషనే మా వూరు అన్నాడు ముసలాయన. దిగిపోతూపోతూ నేను మొదట్లో కూచోటానికి అడిగితే కూచోనిచ్చారో ఇట్లా పడటం మూలంగానేగా మీరు నన్ను పడుకోనిచ్చింది నాకు మతిభ్రమించలేదు మూర్ఖులు అసలే లేవు అన్నాడు.

అరె! నేనన్నా పడకపోతినే అనిపించింది. ముసలాడు ఎంతమందిని మాయచేశాడు పైగా పడుకుని జీవాత్మా పరమాత్మా అని ఉపన్యాసాలు ఇస్తున్నాడు ఒకసారి పడపోయినాడు. రెండోసారి పడ్డాడు. ప్రాణంపోతుందేమో అని భయపడి నలుగురూ లేచి చోటునిచ్చారు. మొత్తానికి అందరికీ లోకరు తినిపించాడు.

"మాయదారి ముసిలోడు అన్నారందరూ.

ఉమర్ ఖయ్యాం చదువుతున్న మరాఠీ మిత్రుడు విస్తుపోయి చూస్తున్నాడు!

పెంకిపిల్ల